క్లుప్తంగా

మధిర మార్కెట్ చైర్మన్ పదవి 'బండారు'కే!

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎర్రుపాలెం మండలం మాము నూరు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు నరసింహారావుకు దక్క నున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ కాగా, గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మధిర మండలానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రంగా హన్మంతరావుకు చైర్మన్ కేటాయించారు. మళ్లీ పదేళ్లకు కాంగ్రెస్‌లోకి అధికారంలోకి రాగా... రొటేషన్ పద్ధతిలో పదవిని ఎర్రుపాలెం మండలానికి కేటాయించే అవకాశముంది. మధిర నుంచి భట్టి నాలుగు సార్లు విజయం సాధించగా, ప్రతీ ఎన్నికల్లో ఎర్రుపాలెం మండలంలో మంచి మెజార్టీ వస్తోంది. ఇక బీసీల్లో బండారుకు మంచి పేరు ఉన్న నేపథ్యాన ఆయనకు మార్కెట్ చైర్మన్ పదవి అప్పగించాలనే భావనకు వచ్చినట్టు సమాచారం.

నేత్రదానం

పెనుబల్లి : మండల పరిధిలోని బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన కొల్లి మురళీకృష్ణ గుండెపోటుతో మరణించగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మంగళవారం సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్రనిధికి అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు పోట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. క్లబ్ సెక్రటరీ సత్యనారాయణ, అనుమోలు సాంబశివరావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడికి డీసీఎంఎస్ చైర్మన్ పరామర్శ


కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న శేషగిరిరావు

తల్లాడ: రాజకీయాల్లో జిల్లా స్థాయి నేతలైన డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు, తల్లాడ సొసైటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి నడుమ ఆది నుంచి రాజకీయంగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇలా సుమారు ముప్పై ఏళ్లుగా ఉండగా.. ఒకే పార్టీలో కొనసాగినా చెరోదారి అన్నట్లు వ్యవహరించేవారు. అయితే, ఇటీవల జక్కంపూడి అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం స్వగ్రామమైన మండలంలోని బిల్లుపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం రాయల పరామర్శించారు. సుమారు ముప్పై ఏళ్ల అనంతరం వీరి కలయికపై మండలంలో చర్చ జరిగింది.

కోర్టు నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

ఎర్రుపాలెం: మధిర కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ.24 కోట్ల నిధులు మంజూరు చేయడంపై మధిర బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు గంధం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోర్టు భవనాల నిర్మాణంపై బార్ అసోసియేషన్ బాధ్యులు ఎన్నికలకు ముందు భట్టిని కలవగా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈమేరకు అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేయడంపై శ్రీనివాసరావుతో పాటు పలువురు న్యాయవాదులు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

'గురుకుల' ప్రిన్సిపాల్‌గా విజయకుమారి



వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జంగం విజయకుమారి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వేములవాడ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నుంచి బదిలీపై వైరా వచ్చిన ఆమె బాధ్యతల స్వీకరణ అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులపై అలసత్వం ప్రదర్శించకుండా వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేలా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

కిడ్నాపర్‌గా భావించి వ్యక్తిపై దాడి

పెనుబల్లి: చిన్నపిల్లల్ని కిడ్నాప్ చేసే వ్యక్తి అనుకుని అనుమానించి మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నాపర్ కొందరు యువకులు మతిస్థిమితం లేని వ్యక్తిని తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన యువకులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులుగా కనబడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు గానీ, 100కు సమాచారం అందజేయాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వామ్మో.. మలుపు


పాలడుగు-గన్నవరం గ్రామాల మధ్యలో ఉన్న మలుపు

ప్రమాదకరంగా పాలడుగు-గన్నవరం రోడ్డు

- ఐదు కిలోమీటర్లకు 12 మలుపులు..!
- సూచిక బోర్డుల జాడ కరువు
- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి

వైరారూరల్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుని వాటికి కావాల్సిన పలు రకాల సదుపాయాలను కల్పిస్తుంది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో అవి నీరు గారుతున్నాయి. దానికి నిదర్శనమే మండల పరిధిలోని పాలడుగు-గన్నవరం రహదారి. లింక్ రోడ్డుగా ఉన్న దీనిని ఏళ్ల కిందట బీటీ రోడ్డు మార్చారు. దీంతో ఈ రోడ్డును రవాణా నిమిత్తం రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకుంటున్నారు. అంతేకాకుండా ఈ మార్గంలో పులిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో నెమలి శ్రీకృష్ణ దేవాలయానికి వెళ్లేందుకు పలు ప్రాంతాల ప్రజలు ఈ రహదారిని ఎంచుకుంటారు. దీంతో ఈ రోడ్డు అన్ని వేళల రద్దీగానే ఉంటుంది.

ప్రయాణమంటే జంకాల్సిందే..

ఇంత ప్రాముఖ్యత కలిగిన ఈ రహదారిపై ప్రయాణించాలంటే భక్తులు జంకుతున్నారు. కారణం పాలడుగు- గన్నవరం వరకు 5 కిలో మీటర్ల దూరం ఉండగా సుమారు 12 వరకు మలుపులున్నాయి. దగ్గరికి పోయే వరకు ఇవి కనబడకపోవడంతో అత్యంత ప్రమాదకరంగా మారాయి. మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఆంధ్రా వెళ్లేందుకు అధిక శాతం ఈ రహదారిని వినియోగించుకుంటారు. దగ్గరికి వెళ్లే వరకు మలుపులు కనబడకపోతుండడంతో రాత్రి వేళలో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి గాయాలపాలైన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఒక్క ద్విచక్రవాహనదారులే కాదు పెద్ద వాహనదారులు సైతం ఇదే పరిస్థితి. గతంలో మలుపు గమనించకపోవడంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరగకపోయినప్పటికీ స్వల్ప గాయాలతో బాధితులు బయటపడ్డారు. నిత్యం ఏదో ఒక చిన్నపాటి ప్రమాదం జరుగుతుండడం ఆనవాయితీ మారిందని స్థానిక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ప్రాముఖ్యత కలిగిన ఈ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఎలాంటి సూచికబోర్డులు లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు, రహదారిపై రేడియం స్టిక్కర్లు వంటివి ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సూచికలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న మలుపులు

ప్రమాదకరంగా మలుపులు



గన్నవరం నుండి పాలడుగు గ్రామాల మధ్యలో ఉన్న రహదారిపై ఉన్న మలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. దగ్గరికి వెళ్లే వరకు కూడా మలుపులు కనబడకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అధికారులు స్పందించి మలుపులు వద్ద చర్యలు చేపట్టాలి.

– కారుమంచి అశోక్, గన్నవరం

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పాలడుగు-గన్నవరం గ్రామాల మధ్యలో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుమారు 12 మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పధాన రహదారిగా ఉన్న నేపథ్యాన దగ్గరికి వెళ్లే వరకు మలుపులు కనబడని పరిస్థితి. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి.

– కోసూరి వెంకటరమణ, పాలడుగు

రుణాలు సక్రమంగా చెల్లించాలి


మాట్లాడుతున్న రవికుమార్


కల్లూరు: రుణాలు తీసుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని సక్రమంగా చెల్లించి తిరిగి రుణాలు పొందాలని ఖాన్‌ఖాన్‌పేట గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అన్నారు. ఉషోదయ మండల మహిళా సమాఖ్య స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం గ్రామ సమాఖ్యలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్యాంక్ లింకేజీ, ఎన్‌పీఏ రుణాల గురించి వివరించారు. ఏపీఎం ఎం.వెంకట్రామారావు మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ చేపడుతున్న కార్యక్రమాలను, బ్యాంక్ లింకేజీ, లోకోస్ యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన కల్పించాలి

ఎర్రుపాలెం: చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలపై తల్లులకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు విధిగా అవగాహన కల్పించాలని బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యురాలు శశిపూర్ణ సూచించారు. మంగళవారం మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు వెంకట్ లాల్,కంటి వైద్యులు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది కాంతమ్మ, రాణి, వెంకటేశ్వరరావు, సుధాకర్, సాయిరెడ్డి, అశోక్, వెంకటేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శశిపూర్ణ

పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఎస్సై

వైరారూరల్: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంగళవారం షేక్ లతీఫ్ ఆర్థిక సాయంతో ప్యాడ్లు, పెన్నులు ఇతర పరీక్ష సామగ్రిని ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం సూర్యకుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి కనబరచాలి

ఏన్కూరు: విద్యార్థులు చదువుపై ఆసక్తి కనబరచాలని ప్రముఖ సైకాలజిస్ట్ జి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం సైదయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు, సుజాత, రాధాకృష్ణ, పుల్లయ్య, కస్తూరి, భీమ్‌సింగ్, రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, కొలిక పోగు వెంకటేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల సమావేశం స్థానిక షాదీఖానాలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు, బుల్లెపోగు కృష్ణ, పరిగడుపు రాము, జొన్నలగడ్డ లక్ష్మణరావు, మరకాల శ్రీను, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చినమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు


సత్తుపల్లిటౌన్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీ గీతాజ్ఞాన మందిరంలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ పార్థసారథి స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ, భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏపూరి పురుషోత్తం, గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, కొనకళ్ల శంకర్‌రావు, శారద, అర్చకులు చైతన్య, సాయికుమార్ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో భీష్మ ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నారాయణపురం కోదండ రామాలయం, తల్లాడ హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం, రామలింగేశ్వర దేవాలయం, అంజనాపురం అభయాంజనేయ స్వామి ఆలయం, కుర్నవల్లి వేంకటాచలపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశ్మీర మహాదేవక్షేత్రం కమిటీ ఎంపిక


అధ్యక్షుడు మాడిశెట్టి వెంకటేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవక్షేత్రం (కల్లూరు అప్పయ్య శివాలయం) ఆలయ నూతన కమిటీని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నేతృత్వంలో ఎంపిక చేశారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా మాడిశెట్టి వెంకటేష్, సభ్యులుగా పెద్దబోయిన శివకృష్ణ, కందుల జ్యోతి, అబ్బూరి యుగంధర్, యనుముల రాము, మూకర నాగమణి, బుర్రి లక్ష్మయ్య, తిరుమలగిరి లక్ష్మయ్యలను ఎంపిక చేసి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి జాబితాను పంపించారు. ఈ మేరకు నూతనంగా ఎంపికైన సభ్యులను ఎమ్మెల్యే రాగమయి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అభినందించారు.

నేడు సేవాలాల్ జయంతి ఉత్సవాలు

కారేపల్లి: సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కారేపల్లి వైఎస్‌ఎన్ గార్డెన్‌లో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు సింగరేణి తహశీల్దార్ ఎస్ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరవుతారని, బంజారాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కమిటీ గౌరవాధ్యక్షుడు దేశిరెడ్డి కేశవరెడ్డి, వాణి దంపతులు మంగళవారం రూ.50,116లు విరాళంగా అందించారు. వనమా ప్రసాద్, శ్రీదేవి, పోలిశెట్టి శివకుమార్, నాగమణి దంపతులు సహకారంతో రూ.30వేల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను వాసవీక్లబ్ గవర్నర్ జి.శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి జగదీష్‌కుమార్, రాధాకృష్ణమూర్తి, వరప్రసాద్, హనుమంతురావు, మల్లికార్జున్‌రావు, పురుషోత్తమరావు, పోకూరి కృష్ణప్రసాద్, సోమిశెట్టి శ్రీధర్, కాలిలేని కాంతారావు, కొత్తూరు ఉమా, అంకమరాజు, గోపాలరావు, నరేష్ పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషా క్రీడా ప్రదర్శన పేరిట క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రముఖ కవి, తెలుగుభాషా పండితులు రంగపురి కృష్ణార్జున్‌రావును సన్మానించారు. పాఠశాల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, రామృష్ణ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు నష్టం జరగొద్దు..

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్


ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఏన్కూరు: గిరిజన రైతులకు నష్టం కలగకుండా సీతారామ లింక్ కెనాల్ పనులను చేపట్టాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో రైతువేదికలో ఇరిగేషన్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని ఎమ్మెల్యేకు రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో గిరిజన రైతులు ఉన్నారని వారి భూములకు నష్టం వాటిల్లకుండ మండలంలో ఐదు చెరువులు సీతారామ ప్రాజెక్టు ద్వారా నింపే విధంగా ప్రణాళిక తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరావు, ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, జేఈ సాగర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కారేపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మంగళవారం వైరాలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, 30 పడకల ఆస్పత్రి, అంబులెన్స్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లింక్ రోడ్లను బీటీరోడ్లుగా మార్చాలని కోరారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుగులోతు హర్షానాయక్, రాజేష్ నాయక్, రాజ్‌కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగంలో రాణించాలి

- ఎమ్మెల్యే మట్టా రాగమయి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి : బాలికలు తాము ఎంచుకున్న రంగంలో విద్యతో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పెనుబల్లి మండల పరిధిలోని అడవిమల్లెల రెసిడెన్షియల్ పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాల సమీపంలో రిక్వెస్ట్ బస్టాప్, తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని, పాఠశాలకు గ్రౌండ్, విద్యార్థినిలకు రక్షణ సోలార్ ఫెన్సింగ్ కావాలని ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఎమ్మెల్యేను కోరారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి లంకాసాగర్ క్రాస్ రోడ్డు రిక్వెస్ట్ బస్టాప్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తెల్లవారుఝామున 4 గంటలకే పాఠశాలకు తాగునీరు సరఫరా చేయాలని ఆదేశాలించారు. పాఠశాలకు గ్రౌండ్, సోలార్ ఫెన్సింగ్‌ను త్వరలోనే అమలు చేస్తానని తెలిపారు. తన నిధుల నుండి నియోజకవర్గంలోని పాఠశాలలకు బెడ్లు, పరుపులు కోసం కోటిరూపాయలు మంజూరీ చేసినట్లు, అవి త్వరలోనే విద్యార్థులకు అందుతాయని, అదేవిధంగా సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పునర్నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరీ చేసినట్లు ఆమె తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్ ప్రత్యూష, పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, నాయకులు నున్నా రామకృష్ణ, కోటేశ్వరరావు, చిన్న నరసింహారావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కళాశాల అడ్మిషన్లకు కరపత్రాల ఆవిష్కరణ..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లకు రూపొందించిన కరపత్రాలను కళాశాలలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వీరన్న, రామచంద్రరావు, రాంబాబు, వినోద్‌కుమార్, మాధవి, విజయలక్ష్మి, వీరారెడ్డి, చెన్నారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ధైర్యంగా ఉండాలి

వైరా: విద్యార్థులు పరీక్షల కాలంలో ధైర్యంగా చదువుతూ ముందడుగు వేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మధు విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు అన్నారు. వైరాలోని మధు విద్యాలయంలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు వేమూరి అజయ్, నాగరాజు, విక్రాంత్, రాహుల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహారం అందజేయాలి


బాలింతకు సూచనలిస్తున్న రేఖాబాయి

ఏన్కూరు: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖాబాయి అన్నారు. మండల పరిధిలోని తిమ్మారావుపేట అంగన్‌వాడీ-1 కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందజేయలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కొండలరావు

చింతకాని: మండల పరిధిలోని మత్కేపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతి కొండలరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతి భాగ్యలక్ష్మీ, పంచాయతీ ప్రత్యేకాధికారి సంపత్‌కుమార్, కార్యదర్శి పడిశాల బాబురావు, తిరుపతి అంజయ్య, బొల్లికొండ శ్రీను, తిరుపతి రమేష్‌బాబు, పుల్లయ్య, రాంమూర్తి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా మెరుగుపడాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: స్వయం సహాయక సంఘాలలో ఉండే మహిళలను ఆర్థికంగా నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దటానికి లక్పతి దీదీ పథకం అమలు చేయనున్నట్టు జీవనోపాధుల డీపీఎం శ్రీనివాస్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సెక్రటరీ సరోజిని, ఏపీఎంలు నాగపుల్లారావు, సుబ్బారావు, ఈఓ రత్నకుమారి, సీసీలు రామారావు, శ్రీనివాస్, కృష్ణయ్య, నరేంద్ర, శ్రీనిధి మేనేజర్ చంటి, ఇందిరా, బాబురావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ వితరణ

వైరా: లయన్స్‌క్లబ్ వైరా సభ్యుడు లయన్ మిట్టపల్లి నాగేశ్వరరావు కుమారుడు మణికంఠ, మీనాక్షి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని సందర్భంగా వైరాకు చెందిన రాచకొండ మౌనికకు నాగేశ్వరరావు వితరణ చేసిన కుట్టుమిషన్‌ను లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, కట్ల సురేష్, శీలం పిచ్చిరెడ్డి, తాడికొండ రాము, మిట్టపల్లి నాగేశ్వరరావు, అరుణ, విజయ్, సౌమ్య, గజ్జెల నళిని, తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బంజారాభవన్ నాణ్యతపై నీలినీడలు


మధిరలో నిర్మిస్తున్న బంజారా భవన్

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని బంజరా కాలనీలో నిర్మిస్తున్న బంజారా భవన్ (ఎస్టీ కమ్యూనిటీ హాల్) నాణ్యతపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ రూ.30 కోట్లు మంజూరు చేయగా, బంజారా భవన్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తుతో నిర్మించేలా రూ.50 లక్షలు నిధులు కేటాయించింది. అయితే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ బీమ్ కుంగిపోయింది. అయినా సరిచేయకుండానే మొదటి అంతస్తు నిర్మాణానికి యత్నిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కాగా, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి టెండర్లు నిర్వహించకుండానే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా.. అప్పటి అధికార పార్టీకి చెందిన ఆయన తూతూ మంత్రంగా పనులు చేపట్టి నిధులు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే ప్రభుత్వం మారగా స్థానిక గిరిజనులు సదరు నిర్మాణాన్ని ఆపాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అయినా ఆపకపోగా మొదటి అంతస్తు స్లాబ్ వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈమేరకు మంగళవారం పలువురు మున్సిపల్ ఇంజనీర్ నరేష్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే, గ్రౌండ్ ఫ్లోర్‌లో బీమ్‌లు సరిచేయించాకే మొదటి అంతస్తు నిర్మాణం చేపట్టేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని స్థానికులు ఇంజనీర్‌ను కోరారు.